
దర్శి: ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ


వైపాలెం: విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పేదల రక్తం జలగల్లా పీలుస్తున్న ప్రభుత్వం

- ఏడు నెలల్లో ప్రజలకు ఏం న్యాయం చేశారు?
- విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి


దర్శి: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ

దర్శి: ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం చార్జీలు తగ్గించకపోగా ట్రూ అప్ చార్జీల రూపంలో పేదల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విద్యుత్ చార్జీల బాదుడుపై నిరసనగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది ప్రజలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, చంద్రబాబు బాదుడే బాదుడు.. అంటూ కూటమి ప్రభుతంపై వ్యతిరేక నినాదాలతో దర్శి పట్టణం దద్దరిల్లింది. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలతో దర్శి వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి విద్యుత్ ఈఈ కార్యాలయం వరకు ప్రజలు కథం తొక్కారు. వైఎస్సార్ సీపీ జెండాలు చేతబట్టి నిర్వహించిన ర్యాలీకి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరయ్యారు. ఈఈ కార్యాలయంలో వినతిపత్ర అందించి అనంతరం బూచేపల్లి విలేకరులతో మాట్లాడారు.

నిలువునా మోసం

ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు భారీగా పెంచడంతో ప్రజలు అల్లాడిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రజలను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. వేలాది రూపాయల కరెంటు బిల్లులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ట్రూ అప్ చార్జీలు ఎత్తేస్తామని, అవసరం అయితే వినియోగదారులే కరెంటు ఉత్పత్తి చేసుకుని అమ్ముకునేలా చేస్తామని కూటమి పార్టీల నేతలు ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే కరెంటు చార్జీలు భారీగా పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. పోలీస్, ఇతర అన్నీ శాఖల అధికారులు కూడా విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకించాలని కోరారు. ఎన్నికల ముందు బాబు ష్యూరిటీ.. భవిషత్ గ్యారంటీ అంటూ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు అనే పరిస్థితికి దాపురించిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ ఏడు నెలల్లో ఒక్కటంటే ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఇసుక పరిస్థితి మరీ దారుణమన్నారు. రేషన్ బియ్యం అక్రమ మార్గంలో దోపిడీ చేయడమే పనిగా కూటమి పాలన కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఒక్క రూపాయి లబ్ధి చూపక పోగా విద్యుత్ చార్జీలు రూపంలో కోట్ల రూపాయలు ప్రజల మీద భారం మోపుతున్నారని విచారం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఉండేదని గుర్తు చేశారు. ఇప్పుడు వారికి వేలాది రూపాయలు బిల్లులు పంపి కట్టకుంటే మీటర్లు పీకేస్తామంటున్నామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ కాలనీల్లో వాటర్ ప్లాంట్‌లు కూడా నడుపుకోకుండా వారు కనీసం మంచినీరు తాగే పరిస్థితి కూడా లేకుండా కూటమి నేతలు చేస్తున్న చేష్టలకు పేద ప్రజలు భీతిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క యూనిట్ విద్యుత్‌కు రూ.2.30 పైసలకుపైగా అదనంగా చార్జీలు వసూలు చేస్తున్నారని చెప్పారు. దాదాపు 35 శాతానికి పైగా విద్యుత్ చార్జీలు పెరిగాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత కాలనీల్లో చీకట్లు నింపుతున్నారని మండిపడ్డారు. రైతులకు సకాలంలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌లు అందించడం లేదని, దొంగల పాలైన ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు బిగించడం లేదని మండిపడ్డారు. వినియోగదారులపై మోపిన చార్జీల బాదుడు ఉపసంహరించుకోవాలని, ఎన్నికల్లో హామీలు ఇచ్చిన విధంగా చార్జీలు పెంపును నిలిపి వేయాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ కొనసాగించాలని, వ్యవసాయ పంపు సెట్లకు వెంటనే కనెక్షన్‌లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దర్శి, కురిచేడు, తాళ్లూరు మండలాల పార్టీ కన్వీనర్‌లు వెన్నపూస వెంకటరెడ్డి, యన్నాబత్తిన సుబ్బయ్య, తూము వెంకట సుబ్బారెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొల్లా ఉదయ భాస్కర్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఎంపీపీలు సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, గోళ్లపాటి సుధాఅచ్చయ్య, మాజీ మండల కన్వీనర్‌లు కాకర్ల కృష్ణారెడ్డి, సూదిదేవర అంజయ్య, జెడ్పీటీసీలు నుసుం వెంకటనాగిరెడ్డి, తాతపూడి రత్నరాజు, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, తుళ్లూరి బాబూరావు, మాజీ జేసీఎస్ కన్వీనర్‌లు మేడికొండ జయంతి, గుంటు పోలయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేవీరెడ్డి, మాజీ సాగర్ ప్రాజెక్టర్ వైస్ చైర్మన్ సద్ది పుల్లారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కండె గంగయ్య యాదవ్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ యరమల మధుసూదన్‌రెడ్డి, నాయకులు చింతా శ్రీనివాసరెడ్డి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, కుందురు నరసింహారెడ్డి, చెరుకూరి జగన్, మజ్జువలి, సామ్యేల్, కొడవటి జాన్, డగ్లస్, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోరే సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి, పానుగంటి మోహన్‌రావు, ఇరుగుల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


దర్శి: భారీగా హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


వైపాలెం: విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయం వద్దకు చేరిన కార్యకర్తలు

ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లిన యర్రగొండపాలెం

- ర్యాలీ అగ్రభాగాన నిలిచిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్
- వై.పాలెంలో రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు

యర్రగొండపాలెం: ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో యర్రగొండపాలెం దద్దరిల్లింది. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అగ్రభాగాన ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నిలిచి విద్యుత్ శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం వరకు నడిచి కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపారు. నియోజకవర్గంలో ఉన్న దాదాపు 197 గ్రామాల నుంచి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దాదాపు 4 వేల మంది వరకు తరలి వచ్చారు. చంద్రబాబు డౌన్ డౌన్, కూటమి ప్రభుత్వం వెంటనే గద్దెదిగాలి, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాలి, పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని చేసిన నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. 565 జాతీయ రహదారి వెంట పడిన వైఎస్సార్ సీపీ అడుగులు కూటమి నాయకులకు దడ పుట్టించింది. ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొనడం వారికి మింగుడు పడటం లేదు. వైఎస్సార్ సీపీ జెండాలు పట్టణంలో రెపరెపలాడాయి. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించేందుకు అనుమతిలేక పోవడంతో పార్టీ కార్యాలయం నుంచి నేరుగా మార్కాపురం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లారు. క్రమశిక్షణగల కార్యకర్తలుగా జెండాలు, ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేసుకుంటూ రోడ్డుకు ఒక వైపు నడవడం అందరినీ ఆశ్చర్య పరిచింది.

ప్రజలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


వైపాలెం: భారీ ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం ప్రజలను దగా చేస్తోందని, ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచమని, అవసరమైతే తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సమరభేరి మోగించారు. ఈ మేరకు స్థానిక కొలుకుల రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి అక్కడ అధికారులకు డిమాండ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, ఇది చూస్తూ తాము ఊరుకునేదిలేదన్నారు. రూ 15,485.36 కోట్ల భారాన్ని చంద్రబాబు ప్రజలపై వేశారని, ఇప్పటికే రూ 6,072.86 కోట్లు వసూలు చేయడం ప్రారంభించారని, జనవరి నుంచి మరో రూ.9,412.50 కోట్ల బాదుడుకు సన్నాహాలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు పెంచడంతో పేద ప్రజలకు పెనుభారంగా మారిందని, గతంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా సరఫరా చేసేవారని, చంద్రబాబు ప్రభుత్వం మాత్రం నిబంధనలు పక్కన పెట్టి వారిని కూడా బాదుతున్నారని విమర్శించారు. చంద్రబాబు గద్దెనెక్కితే రాష్ట్రం అల్లకల్లోలంగా మారుతుందన్న వాస్తవం ఇప్పుడు రుజువు అవుతోందని, పేదలపై మోపుతున్న విద్యుత్ చార్జీల మోతే అందుకు నిదర్శనమన్నారు. జీవిత కాలంలో రాజకీయాల్లో ఇదే అబద్ధం కొనసాగిస్తూ ప్రజలను మోసం చేయడం ఆపివేయాలని, చంద్రబాబు ఇచ్చిన మాట మీద నిలబడాలని, మాట తప్పి ప్రజలను మోసం చేసే విధానాన్ని వదులుకోవాలని, చిట్టచివరి అవకాశాన్ని ప్రజలకు మంచి చేసేందుకు వాడుకోవాలి తప్ప తన కుమారుడికి దోచి పెట్టేందుకు ఉపయోగించుకునేందుకు వీల్లేదన్నారు. చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని ఆయన నినాదాలు చేశారు. ర్యాలీ, విద్యుత్ శాఖాధికారులకు డిమాండ్ పత్రం అందచేసే కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, యర్రగొండపాలెం, పెద్దారవీడు మండలాల ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, పి.కృష్ణారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, జి.రమణారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, వివిధ విభాగాల నాయకులు వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, ఆర్.అరుణాబాయి, ఎ.కోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, రోషిరెడ్డి, జి.సుబ్బయ్య, సుబ్బారెడ్డి, మస్తాన్ రెడ్డి, రమణారెడ్డి, గుమ్మా ఎల్లేష్, వై.మల్లారెడ్డి, వై.లింగారెడ్డి, నాగేశ్వరరావు, పవన్‌కుమార్, కాశిరావు, రాంభూపాల్‌రెడ్డి, దొండేటి నాగేశ్వరరెడ్డి, టి.ఆవులయ్య, డి.వెంకటరెడ్డి, ఎం.సత్యంరెడ్డి, జి.రమణారెడ్డి, షేక్.బుజ్జి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, పి.మల్లికార్జున్, సరళకుమారి, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దొనకొండ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ప్రతిభ కనబరిచి మంచిపేరు తెచ్చుకోవాలి

- క్రీడాకారిణికి బూచేపల్లి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి మంచిపేరు తెచ్చుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. నెట్‌బాల్లో జాతీయస్థాయి పోటీలకు ఎనుబరి ప్రైసీ ఎంపికైంది. చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విషయం తెలుసుకున్న బూచేపల్లి వెంకాయమ్మ.. బాలిక ప్రయాణ ఖర్చుల కోసం బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. దొనకొండ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రైసీ 10వ తరగతి చదువుకుంటోంది. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ పోటీల్లో చక్కగా రాణించి దర్శి నియోజకవర్గానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు.

రూ.28 లక్షలకు చేపల చెరువు వేలం

ముండ్లమూరు (దర్శి): ముండ్లమూరు మండలం పసుపుగల్లు గ్రామ పంచాయతీ పరిధి చింతలపూడి చెరువలో చేపల చెరువు వేలం పాటను రూ.28 లక్షలకు పాడుకున్నారు. ప్రభుత్వ పాట రూ.16.50 లక్షలు కాగా వేములబండ గ్రామానికి చెందిన కంచుమాటి శ్రీనివాసరావు రూ.28 లక్షలకు పాడుకున్నాడు. 2024 సంవత్సరం నుంచి 2027వ సంవత్సరం వరకు చెరువులో చేపలు వేసుకుని ఆదాయం పొందొచ్చని చెప్పారు. డీఎల్‌పీఓ పద్మావతి, ఎంపీడీఓ జనార్దన్‌లు వేలంపాట నిర్వహించారు.

ముండ్లమూరు (దర్శి): మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుకు వేలం పాట నిర్వహించగా రూ.17.50 లక్షలకు దిద్దాల సుధాకర్ రెడ్డి పాడుకున్నారు. 2024 సంవత్సరం నుంచి 2027వ సంవత్సరం వరకు చెరువులో చేపలు వేసుకుని ఆదాయం పొందొచ్చని చెప్పారు. డీఎల్‌పీఓ పద్మావతి, ఎంపీడీఓ జనార్దన్‌లు వేలంపాట నిర్వహించారు.

ఆర్టీసీతోనే సుఖ ప్రయాణం

పుల్లలచెరువు: ఆర్టీసీతోనే ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణం ఉంటుందని మార్కాపురం డీఎం నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక బస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ప్రయాణ ప్రాంగణంలో ఉన్న వసతులు, ఇటీవల కేటాయించిన షాపుల గురించి వాకబ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జానకి రఘు, సీపీఐ కార్యదర్శి గురునాథం కలిసి పలు సమస్యలను డీఎం దృష్టికి తీసుకెళ్లారు. పుల్లలచెరువు నుంచి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, పుల్లలచెరువు నుంచి హైదరాబాద్‌కు కూడా బస్సు ఏర్పాటు చేయాలన్నారు. బస్సు స్టేషన్ ప్రాంగణంలో నీటి సౌకర్యం, బాత్ రూమ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు, సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. బస్సుల ఏర్పాటుపై అధికారులకు తెలియజేస్తామన్నారు. నీరు, బాత్‌రూమ్‌లను త్వరలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకుంటే కార్గో సర్వీసు పాయింట్‌ను ఏర్పాటు చేస్తామని డీఎం తెలిపారు.

క్రీస్తు ప్రేమను కలిగి ఉండాలి


ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మను సన్మానిస్తున్న స్థానికులు

- చందలూరులో చర్చిని ప్రారంభించిన బూచేపల్లి


చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

దర్శి: ప్రతి ఒక్కరూ క్రీస్తు ప్రేమను కలిగి ఉండాలని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని చందలూరులో ఏర్పాటు చేసిన తెలుగు బాప్టిస్టు చర్చిని శుక్రవారం తన తల్లి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన బూచేపల్లికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పాస్టర్ రాజారత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. నూతన చర్చి ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, గీతాలు ఆలపించి క్రీస్తు సందేశం అందించారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మలు మాట్లాడుతూ నూతన చర్చిని ఏర్పాటు చేసుకుని తమ చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. దళిత క్రైస్తవులకు, పాస్టర్లకు తమ కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అందరూ చక్కగా ప్రార్థనలు చేసుకుంటూ దేవుని ఆశీస్సులతో సంతోషంగా, ఆనందంగా జీవించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికులు యర్రగుంట్ల నాగేశ్వరరావు, గొంగటి రవి చంద్ర పాల్గొన్నారు.